క్లుప్తంగా

వాహనదారులకు లైసెన్సు తప్పనిసరి



వాహన రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

రామచంద్రాపురం: వాహనదారులకు లైసెన్సు తప్పనిసరని ఎస్ఐ గిరిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని రాయలచెరువుకట్ట ప్రధాన రహదారి వద్ద తిరుపతి, పచ్చికాపల్లం వైపు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. మైనర్లు వాహనాలు నడిపినా, వారికి బండ్లు ఇచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాయలచెరువుకట్టపై పోలీస్ ఔట్ పోస్టులో ఇద్దరు కానిస్టేబుళ్లు ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

చంద్రగిరి పోలీస్ స్టేషన్ తనిఖీ

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఢిల్లీకి చెందిన బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (బీపీఆర్డీ) సభ్యుడు బాలచంద్రన్ మంగళవారం చంద్రగిరి, తిరుచానూరు పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. స్టేషన్ల పరిధిలో ప్రజలకు అందుతున్న సేవలతో పాటు స్థానికంగా పోలీస్ వ్యవస్థపై ఎలాంటి అభిప్రాయం ఉందనే అంశాలపై సామాన్యులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ప్రతి స్టేషన్ మోడ్రన్ పోలీస్‌స్టేషన్‌గా తయారవ్వాలని సూచించారు. అనంతరం ప్రతి స్టేషన్‌పై నివేదికను రూపొందించి జాతీయ స్థాయిలో బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌కు అందజేసి రాష్ట్రస్థాయిలో పోలీస్ స్టేషన్‌కు ర్యాంకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే స్టేషన్లను సందర్శించినట్లు తెలిపారు. సీఐలు రాజశేఖర్, శివప్రసాద్‌రెడ్డి, ఎస్ఐలు వంశీధర్, హిమ బిందు ఉన్నారు.

రాగి పంట సాగుపై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ ప్రసాద్‌రావు

భాకరాపేట: రాగి పంట సాగు విస్తీర్ణం పెంచాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రంగన్నగారిగడ్డ, కోటబైలు పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాగి సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. ఎలాంటి మందులు అవసరం లేకుండానే పంట చేతికి వస్తుందన్నారు. రైతులకు రాగి విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారులు మనోహర్‌బాబు, మునిరత్నం, ధనంజయరెడ్డి, ధనలక్ష్మి, సర్పంచ్ రెడ్డెమ్మ పాల్గొన్నారు.

లెప్రసీ రోగులకు చెప్పులు పంపిణీ



రోగులకు ఎంసీఆర్ చెప్పులను అందజేస్తున్న వైద్యాధికారులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం కొటాల పీహెచ్‌సీ అధికారులు మంగళవారం లెప్రసీ రోగులకు చెప్పులు పంపిణీ చేశారు. చంద్రగిరి, శానంబట్ల, గంగుడుపల్లి గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8 మందిని గుర్తించిన పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక వారికి ఎంసీఆర్ చెప్పులు పంపిణీ చేశారు. డీఏన్ఎంఓ మధుబాబు మాట్లాడుతూ.. ఈనెల 25వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. లెప్రసీ రోగులకు మందులు అందజేసి చెప్పులు పంపిణీ చేస్తామన్నారు. డీపీఎంఓ రమణ, డీఎల్‌ఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

అనాథ శవానికి దహన సంస్కారం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రెడ్డివారిపల్లిలో నివాసం ఉండే సంసాద్ బేగం (52) మంగళవారం గుండెపోటుతో మృతిచెందింది. 20 ఏళ్ల క్రితం రెడ్డివారిపల్లికి ఒంటరిగా వలస వచ్చిన ఆమె అక్కడి వారితో కలిసిపోయింది. సొంత వారు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగానే జీవించేది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆమె చంద్రగిరికి వచ్చింది. అక్కడ గుండె పోటుకు గురికావడంతో మృతి చెందింది. అనాథశవంగా పోలీసులు మొదట భావించారు. అయితే రెడ్డివారిపల్లి వాసులు గుర్తించి, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, మాజీ సర్పంచ్ మునార్బీలకు సమాచారం అందించారు. ముస్లిం మత పెద్దలు ఆమెకు మతాచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవా రథాల్లో పైలెట్ (డ్రైవర్) పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా పశువైద్యాధికారి రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించి, 35ఏళ్ల లోపు వయస్సు, ఏడాదిపాటు అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని స్పష్టం చేశారు. అదనపు వివరాల కోసం జిల్లా మేనేజర్ రామలింగేశ్వరరెడ్డిని 7207702466 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సేవకులపై పవన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- జగనన్నకు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేకే విమర్శలు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్

తిరుపతి మంగళం: దేశమే మెచ్చేలా ప్రజల ముంగిటకే సేవలందిస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన నీచమైన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్నే అవమానించినట్లు ఉన్నాయని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. తిరుపతి 6వ డివిజన్ చంద్రశేఖర్‌రెడ్డికాలనీలో మేయర్ శిరీషతో కలిసి మంగళవారం గడప గడప కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇంత చేస్తున్న జగనన్నకు వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. దేశ రాజకీయ చరిత్రలో ఎవరూ అందించలేనన్ని సంక్షేమ పథకాలను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి అటు చంద్రబాబు, ఇటు పవన్‌కల్యాణ్ ఓర్వలేకపోతున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఇంటికే చేర్చి జగనన్నకు మంచి పేరు తీసుకొస్తున్నారన్న అక్కసుతో పవన్‌కల్యాణ్ వలంటీర్లను అమ్మాయిలను తరలించే ముఠాగా పేర్కొంటూ నీచమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజాసేవలకులైన వలంటీర్లపై ఇలా మాట్లాడడం తగదని హితవుపలికారు. పవన్ చేసిన దుర్మార్గపు వ్యాఖ్యలకు ఓటుతో బుద్ధి చెబుతామని ప్రజలే చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు కేతం జానకి, పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, టి.మునిరామిరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు శ్రీదేవి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుబాల, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు వేమూరి జ్యోతిప్రకాష్, కాసీమ్, నాయకులు చిమట రమేష్, వెంకటేష్, నాథమునిరెడ్డి, బాలాజీ, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను తిట్టలేక వలంటీర్లపై నిందలు

తిరుపతి తుడా: కోవిడ్ మహమ్మారి జన జీవనాన్ని



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

స్తంభింపజేసిన విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు మేమున్నామంటూ ప్రాణాలకు తెగించి అండగా నిలబడ్డ వలంటీర్లపై నిందలు వేస్తూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ దిగజారి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. నగరంలోని బాలాజీ కాలనీ, ఎమ్మార్‌పల్లి, బైరాగిపట్టెడ ప్రాంతాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందజేశారు. అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్న వలంటీర్లను అవమానించడం దురదృష్టకరమన్నారు. కరోనా మహమ్మారికి భయపడి చంద్రబాబు, పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లోని ఇళ్లల్లో దాక్కున్నారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లోనూ వలంటీర్లు ప్రజలకు సేవలు అందించారన్నారు. పేద ప్రజలకు సేవలందిస్తుండడంతో ఓర్వలేక వలంటీర్లపై పడ్డారన్నారు. గతంలోనూ చంద్రబాబు వలంటీర్లపై నిందలు వేశారని గుర్తు చేశారు. విద్యార్థుల కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ. 56 వేల కోట్లు ఖర్చు చేశారని కొనియాడారు. నాలుగేళ్లలో రూ 2.32 లక్షల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా జమ చేస్తే చంద్రబాబు 5 ఏళ్లలో కేవలం రూ. 7 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. ఇలాంటి దుష్టశక్తులు అధికారంలోకి వస్తే ఈ సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తారన్నారు. ప్రజలు కుట్ర రాజకీయాలను గుర్తించి ఆ పార్టీలను వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఆరణి సంధ్య, షాలిని రెడ్డి, రాజమ్మ, నరేంద్ర నాథ్, కో ఆప్షన్ సభ్యుడు ఇమామ్ సాహెబ్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ఎంతో ఉపయుక్తం



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: జగనన్న సురక్షలో భాగంగా ప్రజలందరికీ ఉచితంగా వివిధ రకాల సేవలను అందిస్తున్నారని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం మండలంలోని నెన్నూరులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెన్నూరు సచివాలయ పరిధిలో 289 కుల ధ్రువీకరణ, 300 ఆదాయ, 3 ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, 2 బియ్యం కార్డులు, 18 ఆధార్ సేవలను ఎలాంటి రుసుం లేకుండా లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. సంక్షేమ పథకాలు, రేషన్‌కార్డు, సర్టిఫికెట్ల సమస్యలు ఉంటే జగనన్న సురక్షలో పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం గంగిరెడ్డిపల్లి, కమ్మకండ్రిగ, రామాపురం గ్రామాల్లో జరిగిన ఫ్రీ హెల్త్ చెకప్ క్యాంపును పరిశీలించారు. ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఢిల్లీ రాణి, డీఎల్‌డీఓ సుశీలాదేవి, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మామిడి తోటల్లో సస్యరక్షణ అవసరం

–ఏడీఏ రాధాదేవి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాధాదేవి

చంద్రగిరి(తిరుపతి రూరల్): మామిడి తోటల్లో కాయాల కోతల అనంతరం సస్యరక్షణ పద్ధతులు అవసరమని డీఆర్సీ తిరుపతి ఏడీఏ రాధాదేవి సూచించారు. చంద్రగిరి మండలం పనపాకంలో మంగళవారం రైతులకు సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మామిడి చెట్లకు కోత తరువాత 15 నుంచి 20 రోజుల వరకు విశ్రాంతి ఇచ్చి అనంతరం కొమ్మ కత్తిరింపులు చేయాలన్నారు. కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు, క్లోరోపైరిఫాస్ 3 మిల్లీలీటర్లు వేప నూనె నీటిలో కలిపి కాండం, చెట్ల కొమ్మలపైన పిచికారి చేయాలని తెలిపారు. లోతుగా దుక్కులు దున్ని 10 ఏళ్లకు పైబడిన చెట్టుకి ఒక కేజీ యూరియా, 5 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, కేజీ పొటాష్, 100 కేజీల పశువుల ఎరువులను చెట్ల పాదుల్లో వేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన అధికారులు శ్రీనివాసులు, శైలజ, ప్రియాంక పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల ఆధునాతన డిజైనర్ వస్త్రాలు

తిరుపతి కల్చరల్: దేశంలోని వివిధ రాష్ట్రాల చేనేత కారులు, డిజైనర్ల ఆధ్వర్యంలో ఎస్ఆర్ కన్వెన్షన్ ఏసీ హాల్లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో కొలువైన చేనేత వస్త్రాలు, భారతీయ సంప్రదాయం ప్రతిబింబించే విధంగా ఆధునాతన డిజైన్లతో లభ్యమవుతున్న వస్త్రాలు చూపరుల మనసు దోచుకుంటున్నాయి. ప్రదర్శన నిర్వాహకుడు టీవీ.రావు మాట్లాడుతూ.. దేశంలో ఎంతో పేరు గాంచిన వివిధ రకాల వస్త్రాలు ఉప్పాడ, కలంకారీ, మంగళగిరి, ప్రింట్ చీరలు, సిల్క్ చీరలు, కాటన్, కాశ్మీర్ సిల్క్, బ్లౌజులు, టాప్స్, వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన గురువారంతో ముగియనుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయికి సత్కారం



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న జీఎంపీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తికి చెందిన గ్రామీణ మెడికల్ ప్రాక్టీషనర్స్ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి జీఎంపీ సభ్యుల సమస్యలను తెలియజేసి వాటి పరిష్కారానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్సీ మీ సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడతానని భరోసా ఇచ్చారు. జీఎంపీ అధ్యక్షుడు కేఎస్.రాజు, ప్రధాన కార్యదర్శి కుమార్, సభ్యులు ఏడుకొండలు, శివశంకర్, మోహన్, రాంబాబు, బాలాజీ, రాజేంద్రకుమార్‌రెడ్డి, వీరయ్య, సురేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు పురస్కారాలు



డీఎం చేతులమీదుగా పురస్కారాలు అందుకుంటున్న అలిపిరి డిపో డ్రైవర్లు, కండక్టర్లు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు పురస్కారాలు ప్రదానం చేసే కార్యక్రమం కొనసాగుతోంది. డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లకు, రాబడిని పెంచిన కండక్టర్లకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని 11 డిపోల్లో 105 మంది కండక్టర్లు, 95మంది డ్రైవర్లకు ఉత్తమ పురస్కారాలు అందించనున్నారు. అందులో భాగంగా మంగళవారం అలిపిరి డిపోలో డీఎం హరిబాబు, అసిస్టెంట్ డీఎం పుష్పలత చేతుల మీదుగా 10 మందికి ప్రతిభ పురస్కారాలు పంపిణీ చేశారు. ఇందులో కండక్టర్లు వై.నారాయణమ్మ, పి.ప్రసాద్, బి.శోభారాణి, డ్రైవర్లు ఎస్.బాలాజీ, సీజీ బాబు, ఏఎస్ఎన్ కుమార్, కే.అమర్నాథ్, జి.సుధాకర్, పీఎస్ఎం అచారి, టీఎస్ వాసు ఉన్నారు.

ఆర్ట్ స్టూడియో పనుల పరిశీలన

తిరుపతి తుడా: ఆర్ట్ స్టూడియో ఆడిటోరియం పనులను మంగళవారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత పరిశీలించారు. ఆగస్టు 15వ తేదీలోపు ఆడిటోరియం పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాల్సిందేనని అధికారులను ఆదేశించారు. ఆడిటోరియంలో 600 సీటింగ్ కెపాసిటీ ఉంటుందని, అయితే ముందు వరుసలో వీవీఐపీల కోసం ప్రత్యేకమైన సీటింగ్ ఏర్పాటు చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. సౌండ్ సిస్టమ్ క్వాలిటీలో ఆకట్టుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైటింగ్ సిస్టమ్ కలర్ ఫుల్‌గా ఉండాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ దేవిక ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న కేరళ గవర్నర్

తిరుమల: తిరుమల శ్రీవారిని కేరళ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్‌ఖాన్ మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు టీటీడీ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం అందించగా.. టీటీడీ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల గవర్నర్ మాట్లాడుతూ.. శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గవర్నర్ తోపాటు ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, డిప్యూటి ఈవో ఆర్–1 హరీంద్రనాథ్, ఓఎస్డీ రామకృష్ణ తదితరులు ఉన్నారు. దీనికిముందు కేరళ గవర్నర్‌కు పద్మావతి అతిథిగృహం వద్ద రిసెప్షన్ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్ పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు.

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న అసోం గవర్నర్

తిరుమల శ్రీవారిని బుధవారం అసోం గవర్నర్ గులాబ్‌చాంద్ కటారియా దర్శనం చేసుకోనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం తిరుమలకు చేరుకున్న ఆయనకు జీఎంఆర్ అతిథిగృహం వద్ద టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

వలంటీర్లను కించపరచడం దారుణం

తిరుపతి లీగల్: నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై ఏలూరు సభలో పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు టి.మునిబాల సుబ్రమణ్యం(దొరబాబు)ఓ ప్రకటనలో అన్నారు. వలంటీర్ వ్యవస్థని కించపరిచి సంఘవిద్రోహ శక్తులకు సమాచారాన్ని చేరవేస్తూ మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. రాష్ట్రంలో 2.60లక్షల మంది వలంటీర్లు పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారని తెలిపారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వారిని నీచంగా చిత్రీకరించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

జనాభా నియంత్రణ అందరి కర్తవ్యం



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ శ్రీహరి, వైద్య సిబ్బంది

తిరుపతి తుడా: జనాభా నియంత్రణ అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ శ్రీహరి మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రతి ఒక్కరూ అవలంబించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాసుల రెడ్డి, హరినాథ్, కిరణ్ నాయక్, జుబేర్, శ్వేత, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఇంటివద్దకే ప్రభుత్వ సేవలు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి

- జగనన్నకు అండగా ఉందాం
- ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి పిలుపు

తిరుపతి మంగళం: అడగకుండానే అన్నీ ఇస్తున్న జగనన్నకు అందరం అండగా ఉందామని 2024 చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళం సప్తగిరినగర్ పంచాయతీలో మంగళవారం ఆ పంచాయతీ ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో పాటు అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ జానీబాషా పాల్గొని ప్రజలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగనన్న, చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిరంతరం ప్రజాసంక్షేమం కోసం శ్రమిస్తున్నారన్నారు. గడిచిన నాలుగేళ్లలో ఒక్క సప్తగిరి నగర్ పంచాయతీలోనే రూ.9కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు వెల్లడించారు. కరోనా సమయంలో ఎవ్వరూ సాహసించని విధంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజాసంక్షేమం, ఆరోగ్యమే తన లక్ష్యంగా అనేక సేవలందించిన గొప్ప నాయకుడు తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అని కొనియాడారు. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా ప్రజాసంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మోహిత్‌రెడ్డి తెలిపారు.

పట్టా పొందిన ప్రతి ఒక్కరికీ స్థలం చూపిస్తాం

ఇంటి పట్టా ఇచ్చారని, స్థలం చూపలేదని స్థానిక మహిళలు ఎంపీపీ మోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా.. స్పందించిన ఆయన మంగళం పంచాయతీలో ఇంటి పట్టా పొందిన ప్రతి ఒక్కరికీ స్థలం చూపిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు కొంత స్థల వివాదం ఉండడంతో ఆలస్యమైందని, రెండు వారాల్లోగా సమస్య పరిష్కారమవుతుదని, దీనిపై కలెక్టర్ తగుచర్యలు తీసుకుంటున్నారని స్థానిక మహిళలకు వివరించారు.సర్పంచ్ నాగభూషణమ్మ, ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, రణధీర్‌పురం పంచాయతీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వీఆర్‌వోలు భూపతి, సుమన్, ఎంపీటీసీ లక్ష్మయ్య, పార్టీ నాయకులు మల్లెల నాగరాజు, సుధాయాదవ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సాధికారత సాధ్యం

పాకాల: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీతోనే ప్రజాసాధికారత సాధ్యమని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇరంగారిపల్లి పంచాయతీ ముద్దలపల్లి గ్రామంలో గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇరంగారిపల్లి పంచాయతీలో రూ.7.11 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ముద్దలపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గ్రామంలో 3 సీసీరోడ్లు వేశామన్నారు. ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యురాలు నంగా పద్మ, నాయకులు నంగా నరేష్‌రెడ్డి, నంగాబాబురెడ్డి, కస్తూరి, సర్పంచ్ వసంత పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సంస్కృత సమ్మేళనం



సంస్కృత భాషా జనజాగరణ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రిత్వశాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ ప్రతినిధులు, వర్సిటీ వీసీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌యూ)లో బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు జాతీయ సంస్కృత సమ్మేళనం నిర్వహించనున్నారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో మైసూరుకు చెందిన సంస్కృత ఫౌండేషన్, ఎన్ఎస్‌యూల సౌజన్యంతో తిరుపతి వేదికగా తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్.కృష్ణమూర్తి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను వారు విలేకర్లకు వివరించారు. తొలిసారిగా తిరుపతిలో నిర్వహిస్తున్న జాతీయ సంస్కృత సమ్మేళనానికి దేశ నలుమూలల నుంచి 60 మంది పండితులు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా కేరళ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్‌ఖాన్, గౌరవ అతిథులుగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ కార్యదర్శి గోవిందమోహన్, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్, టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, అలాగే మధ్యాహ్నం 2గంటలకు వర్సిటీ చాన్సలర్ డాక్టర్ ఎన్.గోపాలస్వామి అధ్యక్షతన జరిగే అష్టావధానానికి ముఖ్యఅతిథిగా అస్సాం గవర్నర్ గులాబ్‌చంద్ కటారియా, గౌరవ అతిథులుగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆర్థిక సలహాదారు రంజన్‌చోప్రా, సంయుక్త కార్యదర్శి ఉమానందూరి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ చల్లా వెంకటేశ్వర్, ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్, ప్రొఫెసర్ గణపతిభట్, డాక్టర్ జేబీ.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన రహదారులతోనే నగరాభివృద్ధి సాధ్యం



రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ఏ నగరమైన ఉన్నతంగా అభివృద్ధి చెందాలంటే ఆ నగరానికి మెరుగైన రవాణా వ్యవస్థ ఉండాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్‌లో శ్రీనివాస కల్యాణ మండపం నుంచి బైరాగిపట్టెడకి వెళ్లే ప్రధాన రహదారిని సీసీ రోడ్డుతో అభివృద్ధి చేశారు. మంగళవారం ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుపతి నగరానికి సరైన రోడ్ల వ్యవస్థ లేకపోవడం పెద్ద లోటుగా మారిందన్నారు. నగరం కొంత భాగంలోనే అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ఈ కారణంగానే దశాబ్దాలుగా నగరవాసులు ట్రాఫిక్ చక్రబంధంలో జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ లోటును అధిగమించేందుకే నగరంలో రోడ్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. నగరంలో ప్రతి రోడ్డును అభివృద్ధి చేసి తీరుతామన్నారు. శ్రీనివాస కల్యాణ మండపం పక్కన వెళ్లే రోడ్డు పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రూ.1.50 కోట్లతో సీసీ రోడ్డు నిర్మించడం వల్ల రాఘవేంద్రనగర్, కేశవాయన గుంట, ఎస్.జి.ఎస్ ప్రాంతాల ప్రజలకు సౌకర్యవంతంగా మార్గామని తెలిపారు. మేయర్ శిరీష మాట్లాడుతూ.. వచ్చే ఆరు నెలల్లో తిరుపతి నగర రూపు రేఖలు మార్చేలా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. అవసరమైన రహదారులు, కాలువల నిర్మాణం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్పొరేషన్ ఎస్.ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డీఈ మహేష్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటేషన్ సూపర్‌వైజర్ చెంచెయ్య, పార్టీ నాయకులు అనీల్‌రెడ్డి, జాషువా, రెడ్డివారి ప్రభాకర్ రెడ్డి, గోవింద్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

తిరుపతి కల్చరల్: గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న రైతులకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం రైతు సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలో అత్యధికంగా మామిడి రైతులు ఉన్నారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని కోరారు. పాడి రైతులు కూడా దోపిడీకి గురవుతున్నారని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు కోసం ఉద్యమించాలన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు సి.సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.